ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

- ప్రత్యేక పూజలు చేసిన బంజారాలు
- పలు గ్రామాల్లో శోభాయాత్రలు


ఆదిలాబాద్‌రూరల్: పూజలు చేస్తున్న బంజారా కులస్తులు

ఆదిలాబాద్‌రూరల్: బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల బంజారా భవనంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. అందులో భాగంగానే భోగ్‌భండార్ కార్యక్రమాన్ని నిర్వహించి జగదంబా, సంత్ సేవాలాల్ మహరాజ్, రామారావు మహరాజ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాథోడ్ హీరాలాల్ నాయక్ మాట్లాడుతూ.. ఈనెల 20న జిల్లా కేంద్రంలోని రాంలీలా మైదానంలో సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, సంతప్, సురేశ్ నాయక్, డావ్ శ్రీనివాస్, సీహెచ్ కిషన్, ఆర్.శ్రీనివాస్, పవన్ నాయక్, రామారావు, జాదవ్ బలిరాం, రాథోడ్ మున్న పాల్గొన్నారు.

నార్నూర్: సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను గురువారం నార్నూర్, గాదిగూడ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో సేవాలాల్ మహరాజ్ పల్లకిని ఊరేగించారు. రాజులగూడ, భీంపూర్ ఏంపల్లి తండా, ససుంగాపూర్ గ్రామాలతో పాటు గాదిగూడ మండలంలోని ఖండోవ్, తోయగూడ గ్రామాల్లో సేవాలాల్ జయంతి జరుపుకున్నారు. మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీలో బానోత్ గజానంద్ నాయక్ పాల్గొని మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో మాన్కాపూర్ తాజా మాజీ సర్పంచ్ రాథోడ్ సావిందర్, గ్రామపెద్దలు రాథోడ్ దిగంబర్, ఆడే సురేశ్, చౌహాన్ యశ్వంత్ రావ్, చౌహాన్ మహేందర్, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

బోథ్: బోథ్ మండల కేంద్రంలో శ్రీసంత్ సేవాలాల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో బంజారా నాయకులు, మహిళలు, గోర్‌సేన నాయకులు శోభాయాత్ర నిర్వహించారు. శ్రీసంత్ రామారావ్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సాయినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జెడ్పీటీసీ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు ఆడె గజేందర్‌లు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండల కేంద్రంతో ఆయా గ్రామాల్లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కొల్హారీలో నిర్వహించిన వేడుకలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొని మాట్లాడారు. అనంతరం సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలో డీజే పాటలతో ర్యాలీ నిర్వహించారు. బంజారా సమాజ్ నాయక్ రాథోడ్ రామారావ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ మాట్లాడారు. సంత్ సేవాలాల్ ఆశయాలను నెరవేర్చడానికి యువత ముందుకు సాగాలన్నారు. సర్పంచ్ జాదవ్ సునీతా రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే, స్థల దాత మాజీ సర్పంచ్ పవార్ రవీందర్ నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీలా, ఆడే సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: బంజారాల ఆధ్యాత్మిక గురువు సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి కోసం సేవాలాల్ చేసిన కృషి మరవలేనిదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్, బంజారాల నాయకులు ఆడే వసంత్‌రావు, జాదవ్ వసంత్ నాయక్, రాథోడ్ రాజశేఖర్, రాథోడ్ సురేందర్, ఆడె బాబులాల్, ఆడే జనార్ధన్, జశ్వంత్ నాయక్ పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలో లంబాడాల సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం సేవాలాల్ కమ్యూనిటీ హాల్ వద్ద సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఠాక్రే గంభీర్, అడనేశ్వర ఫౌండేషన్ చైర్మన్ సతీశ్ పవార్, లంబాడా సంఘం మండల అధ్యక్షుడు రాథోడ్ గణేష్, రాథోడ్ రోహిదాస్, చరణ్, జాదవ్ సీతరాం, రాథోడ్ దినేశ్, చౌహాన్ సంతోశ్ పాల్గొన్నారు.


బేలలో లంబాడాల ర్యాలీ


గుడిహత్నూర్: పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్


నేరడిగొండ: సేవాలాల్ పూజలో పాల్గొన్న ఎంపీపీ

సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలి


పూజ చేస్తున్న దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేమ్‌సింగ్ మహరాజ్

నార్నూర్: వచ్చే మహాశివరాత్రి రోజు నుంచి 41 రోజులపాటు ప్రతీ లంబాడా కుటుంబం నుంచి ఒకరు శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ దీక్ష చేపట్టాలని దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేమ్ సింగ్ మహరాజ్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తపల్లి (హెచ్) గ్రామంలో ఉన్న జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా భోగ్ బండారో మహాపూజ చేశారు. భక్తులను ఉద్దేశించి హిత బోధనలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఠాక్రు నాయక్, మాజీ సర్పంచ్ చౌహాన్ దిగంబర్, పవార్ దేవిదాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉర్దూ భవన్ కమిటీ ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో గల ఉర్దూ భవన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ ముబారక్, ప్రధాన కార్యదర్శిగా అబ్దు ల్ రజాక్, ఉపాధ్యక్షుడిగా షాకీర్, సభ్యులుగా సర్దార్, మౌలాన అలీ, సాదిఖ్, బబ్లులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఖాజి నయీమొద్దీన్ వ్యవహరించారు. గత ప్రభుత్వం ఉర్దూ భవన్‌ను పట్టించుకోలేదని, సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

క్లుప్తంగా

విద్యుత్ తీగలు అమర్చితే కఠిన చర్యలు

ఆదిలాబాద్‌రూరల్: అటవీ జంతువులను వేటడటం, వాటి బారిన నుంచి పంటలను రక్షించేందుకు ఎవరైనా విద్యుత్ తీగలు అమర్చితే చర్యలు తప్పవని ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై ముజాహిద్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల భూపాలపల్లి జిల్లాలో కూంబింగ్ నిర్వహిస్తున్న జవాన్‌కు విద్యుత్ తీగలు తగిలి మరణించినట్లు పేర్కొన్నారు. జిల్లాలోనూ గతంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు.

పోచమ్మ ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న గుండవార్ అశోక్

బేల: మండల కేంద్రంలోని అశోక్‌నగర్ కాలనీలో పోచమ్మ ఆలయం నిర్మాణానికి గురువారం ఆర్యవైశ్య సంఘం మండల గౌరవ అధ్యక్షుడు గుండవార్ అశోక్, తన కుమారుడు అనోజ్‌తో కలిసి రూ.1లక్ష నగదును విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు అమ్రేష్‌రెడ్డి, కిష్టన్న, కన్నె శ్రీనివాస్ రెడ్డి, స్వామి, ఉషయ్య, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ వెంటనే జమ చేయాలి

ఎదులాపురం: మున్సిపల్ కార్మికుల ఈఎస్ఐ నగదును వెంటనే ఖాతాల్లో జమ చేయాలని మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి అగ్గిమల్ల స్వామి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూసీ కార్యాలయంలో గురువారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా సదస్సు నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని అన్నారు. రేపు జరిగే దేశవ్యాప్త సమ్మెలో మున్సిపల్ కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

జైనథ్: ఈనెల 16న నిర్వహించే మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన సభ సమావేశాలు కొనసాగుతున్నందున సమావేశాన్ని ప్రస్తుతం వాయిదా వేయడం జరిగిందన్నారు.

రాజమల్లు సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు సేవలు చిరస్మరణీయమని ఆదిలాబాద్ మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఇటీవల రాజమల్లు గుండెపోటుతో మృతి చెందగా గురువారం ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. సంతాప సభలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి రాజమల్లు చేసిన కృషిని గుర్తు చేశారు. ఆయన వెంట ఆర్టీసీ ఎండీ సజ్జనార్, ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

కైలాస్‌నగర్: మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఖమర్ అహ్మద్‌ను గురువారం మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బోథ్: సొనాల గ్రామ పంచాయతీ పంచాయతీ కార్మికులను పంచాయతీ కార్యదర్శి స్వామి సత్కరించారు. పంచాయతీల్లో ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈనెల 7 నుంచి గురువారం వరకు కార్యక్రమాలను నిర్వహించినందుకు సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ అజారోద్దీన్, మాజీ సర్పంచ్ చెట్లపెల్లి సదానందం, మాజీ సర్పంచ్ రామాయి గంగామణి, కల్పన భోజరాజు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు..

బోథ్: బోథ్ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన రమేశ్‌ను యూత్ కాంగ్రెస్ నాయకులు గురువారం సత్కరించారు. మండల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి వినయ్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుడాల అనీష్, అరుణ్ రెడ్డి, శ్రీకాంత్, మహేశ్, పరశురాం, సాయినాథ్, రవికాంత్, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని ప్రయోగవిద్య

- పాఠశాలల్లో పరికరాలు, ప్రత్యేక గదులు కరువు
- పట్టించుకోని అధికారులు
- నష్టపోతున్న విద్యార్థులు


పాఠశాల గదిలో ఉన్న ప్రయోగ పరికరాలు

తలమడుగు: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందిస్తున్నాం. పాఠశాలలకు కోట్లాది రూపాయాలు వెచ్చిస్తున్నామని పాలకులు చెప్తున్నారు తప్పా ఆచరణలో అమలు చేయడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగ విద్యకు ప్రత్యేకంగా ల్యాబ్‌లు, ప్రత్యేక గదులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. తలమడుగు మండలంలో 12 జెడ్పీ పాఠశాలలు, మొత్తం విద్యార్థులు 1881 మంది ఉన్నారు. ఉన్నత పాఠశాల స్థాయిలోనే సామాన్య శాస్త్రానికి సంబంధించిన అంశాలపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగించేందుకు సైన్స్ పరికరాలు కొనుగోలు కోసం ఏటా ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. ప్రయోగశాలలకు ప్రత్యేక గదులు లేక సైన్స్ పరికరాలు భద్రపరిచేందుకు ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారుతుంది. దీంతో బీరువాలలో భద్రపరుస్తున్నారు. అన్ని పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌లు లేక తరగతి గదిలోనే బోధిస్తున్నారు. అన్ని పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయం అధికారులకు తెలిసినా.. ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు.

సరిపోని నిధులు..

ప్రయోగశాల ఏర్పాటు, రసాయన కొనుగోలుకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో ఉపాధ్యాయులకు ఆసక్తి ఉన్న బోధించలేని పరిస్థితి నెలకొంది. లైబ్రరీ పుస్తకాలు చిన్న పరికరాలకే నిధులు సరిపోతున్నాయి. గతంలో రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఉన్నత పాఠశాలకు రూ. 25,000 మంజూరు చేసేది. ప్రస్తుతం సర్వశిక్ష ఆధ్వర్యంలో దాదాపు రూ. 25,000 నుంచి రూ. 50,000 వరకు గ్రాంట్స్ రావడం జరుగుతుంది. వీటితో లైబ్రరీ పుస్తకాల కొనుగోలు, విద్యుత్ బిల్లులు చెల్లించడం, బోధనకు అవసరమైన సామగ్రికే డబ్బులు సరిపోతున్నాయి. ప్రయోగశాల వస్తువులు కొనలేకపోతున్నామని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో విద్యార్థులకు ప్రయోగ విద్య అందడం లేదు. గతంలో కంటే ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితికి తగినట్లుగా సౌకర్యాలు కల్పించడం, ప్రయోగశాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రయోగ విద్య విద్యార్థులకు అందేలా చూడాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

విషయ పరిజ్ఞానం పెరుగుతుంది



పాఠ్య పుస్తకాలను బట్టీ పట్టడం కన్నా ప్రయోగ గదిలో ప్రయోగాలను ప్రాక్టికల్‌గా చేస్తే విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. అయితే పాఠశాలలో ప్రత్యేక ల్యాబ్ అంటూ, (ప్రత్యేక గదులు) ఏం లేకపోవడంతో తరగతి గదిలోనే ప్రయోగాలను వివరిస్తున్నారు. దీంతో అర్థం కావడం లేదు.

– హర్షవర్ధన్, విద్యార్థి, ఖోడద్

పరికరాలు ఉన్నాయి

ప్రభుత్వ పాఠశాలలో ప్రయోగాత్మక బోధన బోధించేందుకు గతంలో తీసుకున్న పరికరాలు అందుబాటులో ఉన్నాయి. కానీ ప్రత్యేకమైన ప్రయోగశాలలకు గదులు లేవు. దీంతో పరికరాలను ఉపాధ్యాయులు వారివారి బీరువాలలో భద్రపరుస్తున్నారు. తరగతి గదిలోకి వెళ్లి వివరిస్తున్నారు. ప్రయోగ విద్య విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందాలంటే ప్రత్యేక గదులు నిర్మించాల్సి ఉంది.

– నారాయణ, ఎంఈవో

రోడ్డు బాగుచేయాలని గ్రామస్తుల ధర్నా


రోడ్డుపై బైఠాయించిన బీర్సాయిపేట గ్రామస్తులు

ఉట్నూర్‌రూరల్: ఆదిలాబాద్– మంచిర్యాల ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న దంతన్‌పల్లి, బీర్సాయిపేట గ్రామాల్లోని రోడ్డు గుంతలుమయంగా మారిందని బీర్సాయిపేట గ్రామస్తులు గురువారం ధర్నా చేపట్టారు. రోడ్డు సమస్యలపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందా అని ఆందోళన చెందుతున్నామన్నారు. ఇది వరకే అనేక ప్రమాదాలు జరిగిన అనేక మంది ప్రాణాలు గాల్లో కలిశాయన్నారు. అర గంటకు పైగా రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్‌లు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను సముదాయించడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ అంకవ్వ, గ్రామస్తులు పల్లెల లక్ష్మి, ఆంజనేయులు, మిట్టపెల్లి కృష్ణా రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటి సమ్మె జయప్రదం చేయాలి

ఎదులాపురం: కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం నేడు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గ్రామీణ బంద్ జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు లంక రాఘవులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలు చేయాలన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడలో శుక్రవారం గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

వామపక్షాల మద్దతు

కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ బంద్‌కు వామపక్షాలు మద్దతును ప్రకటిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు.

ఇచ్చోడ: నేడు జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కల్లెపెల్లి గంగయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల పట్ల వ్యతిరేక విధానాలను అవలభిస్తుందని ఆరోపించారు. కార్మికులు, కర్షకులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమ్మెకు సంపూర్ణ మద్దతు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా రైతులు, కార్మికులు ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌కు కాంగ్రెస్ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ప్రకటనలో తెలిపారు. ప్రజలు, వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని కోరారు.

పండ్ల తోటల రక్షణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రస్తుతం వాతావరణ మార్పుల కారణంగా మామిడి, జామ తోటల్లో రైతులు సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్‌కుమార్ అన్నారు. గురువారం ఉట్నూర్ ఐటీడీఏ ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రంలో నర్సరీల్లో పనిచేస్తున్న సాంకేతిక సహాయకులు, సిబ్బందికి పండ్ల తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పండ్ల తోటలను పరిశీలించి, నీటి ఎద్దడిని తట్టుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఉల్లి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుదీర్‌కుమార్, సాంతికేక సహాయకులు కుమారి, అర్పిత, పూజ పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: ఆరోగ్యంపై విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆడే గజేందర్

తలమడుగు: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. గురువారం జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి కార్యాలయంలో రుయ్యాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు. ప్రతీ కార్యకర్త ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలన్నారు. త్వరలో అన్ని గ్యారంటీలను అమలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కల్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బాబన్న, వెంకన్న యాదవ్, బోథ్ మండల అధ్యక్షుడు మహేందర్, నారాయణ, రఫీ సాంబశివ్, పోశెట్టి పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక


ఇచ్చోడ: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన వ్యవసాయ సహకార సంఘం భవన ప్రారంభోత్సవానికి బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ వస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పాల్గొనాలని కోరారు.

త్వరలో కొలాం సేవా సంఘం ఎన్నికలు


మాట్లాడుతున్న కొడప సోనేరావు

ఆదిలాబాద్‌రూరల్: గత మూడు నెలల క్రితం కొలాం సేవా సంఘం జిల్లా కమిటీ రద్దు చేయడం జరిగిందని, త్వరలో నూతన కమిటీని ఎన్నుకుంటామని సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు కొడప సోనేరావు అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కోర్ కమిటీకి పూర్తి బాధ్యతలు ఇచ్చినప్పటికీ కూడా ఎన్నికలు నిర్వహించకపోవడం సరైంది కాదన్నారు. కొంత మంది సంఘాన్ని పక్కదోవ పట్టిస్తూ వారి స్వలాభం కోసం పనిచేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కుంరం యువసేన జిల్లా అధ్యక్షుడు కుమ్ర రాజు, ఆదిలాబాద్‌రూరల్ మండల అధ్యక్షుడు టేకం ముత్త, మడావి జంగు, కేశవ్‌రావు, మడావి కిషన్ పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామాలు పరిశుభ్రం


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రామారావు

ఇచ్చోడ: అందరి సహకారంతోనే గ్రామాలు పరిశుభంగా ఉన్నాయని సిరిచెల్మ పంచాయతీ ప్రత్యేకాధికారి జాదవ్ రామారావు అన్నారు. గురువారం సిరిచెల్మ, బావోజిపెట్, కేశవపట్నం గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేకమైన కార్యచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. చెత్తను రోడ్లపై వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మురికి నీటి కోసం ఎవరి ఇంటి ఆవరణలో గుంటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.